క్లుప్తంగా

ప్రతిభ చాటిన విద్యార్థులకు సన్మానం



అయిజ: జవహర్ నవోదయ విద్యాలయంలో ప్రవేశం పొందేందుకు 6వ తరగతి ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఆదివారం మండల కేంద్రం లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నాయకుడు సంకాపురం రాముడు శాలువా కప్పి సన్మానం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మహేష్, నరసింహ, వీరేంద్రను ప్రశంసించారు. కార్యక్రమంలో పీఈటీ సుబ్బన్న, బీఆర్ఎస్ నాయకులు మల్లికార్జున్, అశ్వ మారెప్ప తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవుల శాంతి ర్యాలీ



ధరూరు: మండల కేంద్రంలో ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రి సమీపంలో పాస్టర్ ప్రవీణ్ పగడాల అనుమానాస్పద మృతిపై ఐక్య సంఘాల ఆధ్వర్యంలో క్రైస్తవులు భారీ శాంతి ర్యాలీ నిర్వహించారు. ఆదివారం సాయంత్రం 7 గంటలకు ఐదు సంఘాల క్రైస్తవులు ఎంబీ షాలేం చర్చి వద్ద ప్రత్యేక ప్రార్థనల అనంతరం ర్యాలీ చేశారు. ఉయ్ వాంట్ జస్టిస్ అంటూ నినాదాలు చేశారు. ఆయన చేసిన సేవలు కొనియాడారు. అనంతరం స్థానిక వైఎస్సార్ చౌరస్తాలో పాస్టర్లు మాట్లాడారు. ప్రవీణ్ పగడాల మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. మీ మతాన్ని మీరు ప్రేమించి.. పరమతాన్ని గౌరవించాలని కోరారు. అనంతరం కొవ్వొత్తులు వెలిగించి ప్రవీణ్ పగడాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో పాస్టర్లు రవి కుమార్, అబ్రహం, కృపరాజ్, ఆయా సంఘాల సంఘ పెద్దలు పాల్గొన్నారు.

చర్చి నిర్మాణానికి విరాళం



గట్టు: మండల పరిధిలోని బల్గెర గ్రామంలోని మెథడిస్ట్ చర్చి నిర్మాణానికి 500 బస్తాల సిమెంట్ కోసం నగదును విరాళంగా రామకృష్ణనాయుడు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా దాతను చర్చి పెద్దలు అభినందించారు. కార్యక్రమంలో చిన్న గిరప్ప, రమేష్, హనుమంతు, భాస్కర్, రాజేష్, ప్రసాద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

మత సామరస్యాన్ని కాపాడుకుందాం

కేటీదొడ్డి: ముస్లింలు, హిందువులు సోదర భావంతో మెలిగి మత సామరస్యాన్ని కాపాడాలని ఎమ్మెల్యే తనయుడు బండ్ల సాయి సాకేత్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని సోంపురం గ్రామంలోని మసీదులో రంజాన్ ఉపవాస దీక్షల్లో ఉన్న ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ హనుమంతు, నాయకులు సుభాన్, మాజీ రాజశేఖర్, రామకృష్ణనాయుడు, వెంకన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

హైవేపై తప్పిన పెను ప్రమాదం

ఎర్రవల్లి: జాతీయ రహదారిపై పెను ప్రమాదం తప్పిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. హైదరాబాద్ నుంచి కర్నూల్ వైపు వెళ్తున్న ట్యాంకర్ ఎర్రవల్లి కూడలిలో అజాగ్రత్తగా రోడ్డు దాటుతున్న కారును స్వల్పంగా ఢీకొట్టింది. ప్రమాదంలో కారు ధ్వంసం కాగా అందులోని ఐదుగురు ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. దీంతో హైవేపై కొంతమేరకు ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వాహనాలను పునరుద్ధరించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు

ఎర్రవల్లి: జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలైన ఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. అలంపూర్‌కు చెందిన వ్యక్తి జాతీయ రహదారిపై వేముల స్టేజీ సమీపంలో రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ నుంచి కర్నూల్ వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు కాగా అంబులెన్స్‌లో కర్నూల్ ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు.



అయిజలో దుర్గమ్మ ఆలయానికి బయలుదేరుతున్న భక్తులు



చెన్నిపాడులో పంచాంగం వివరిస్తున్న పండితుడు శ్రీకాంత్‌శర్మ

వైభవంగా ఉగాది వేడుకలు

సాక్షి నెట్‌వర్క్: ఉగాది పండుగను పురస్కరించుకుని ఆదివారం జిల్లా వ్యాప్తంగా ఉగాది సంబురాలు అంబరాన్నంటాయి. తెల్లవారు జామునుంచే ఆలయాలు కిటకిటలాడాయి. ఉగాది సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఆయా ఆలయాల్లో విశ్వావసు నామ సంవత్సర ఉగాది పంచాగ శ్రవణ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. షడ్రుచులతో తయారు చేసిన ఉగాది పచ్చడిని స్వీకరించి నూతన తెలుగు సంవత్సరానికి స్వాగతం పలికారు. వ్యవసాయ క్షేత్రాల్లో రైతన్నలు పనులకు శ్రీకారం చుట్టారు. పొలాల్లో దుక్కులు దున్ని సందడి చేశారు. తెలుగు సంవత్సర మొదటి రోజు వ్యవసాయ పనిముట్లకు, ఎద్దులకు, పుడమి తల్లికి పూజలు చేశారు. ఉగాదినాడు భూమికి, ఎద్దులకు, వ్యవసాయ పరికరాలకు పూజలు చేస్తే అధిక దిగుబడులు వస్తాయన్నది నమ్మకంగా రైతులు భావిస్తారు. జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రం దక్షిణ కాశీ అలంపూర్ క్షేత్రంలో ప్రత్యేక పూజలు చేశారు. అదే విధంగా పలు దేవాలయాల్లో పురోహితులు విద్వాంతులు పంచాంగ పఠనం నిర్వహించారు. సంవత్సరాంతం వర్షాలు, పంటల సాగు, రాశిఫలాలు వంటి భవిష్య వివరాలతో ప్రజలకు వివరించారు. గ్రామ దేవతలకు ప్రత్యేక వంటకాలతో తయారు చేసిన నైవేద్యాలు సమర్పించడం రైతులకు ఆనవాయితీగా వస్తోంది. ఆయా గ్రామాల్లో క్రీడా ఉత్సవాలు, ఆటపాటలతో తెలుగు నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు.



కేటీదొడ్డిలో పూజల్లో పాల్గొన్న భక్తులు



ఎర్రవల్లిలో ఈదమ్మకు ప్రత్యేక బోనాలు సమర్పిస్తున్న భక్తులు



ఉండవెల్లిలో పంట పొలంలో ఎద్దులతో రైతు



అలంపూర్ జోగులాంబ అమ్మవారి ఆలయంలో భక్తుల సందడి



గట్టులో పంచాగ శ్రవణం వింటున్న గ్రామస్తులు



అయిజలో కట్టకింది తిమ్మప్పస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



కేటీదొడ్డిలో పంట పొలంలో పూజలు చేసి సేద్యం ప్రారంభిస్తున్న యువకులు

ఉత్సాహంగా సందెరాళ్ల పోటీలు

గట్టు: మండల పరిధిలోని రాయాపురం గ్రామంలో ఆదివారం సందెరాళ్ల పోటీలను బీఆర్ఎస్ నాయకుడు బల్గెర హనుమంతునాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామస్తులంతా కలసి కట్టుగా పండుగలు జరుపుకోవాలని సూచించారు. అనంతరం గుట్టపైనున్న కంబరాయుడు ఆలయాన్ని దర్శించుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వీరేష్, కర్రెప్ప, నర్సింహులు, మొబ్బు తిమ్మప్ప, అమ్మన్న, బుడ్డ తిమ్మప్ప, కావలి నర్సింహులు, పూజారి తిమ్మారెడ్డి, గొకారప్ప తదితరులు పాల్గొన్నారు.



రాయాపురంలో సందేరాళ్ల పోటీలు ప్రారంభిస్తున్న హనుమంతునాయుడు

విజేతలకు బహుమతుల ప్రదానం

అమరచింత: ఉగాది పర్వదినం సందర్భంగా పట్టణంలో ఆదివారం నిర్వహించిన ఎద్దుల బండి గిరక లాగుడు పోటీల్లో గెలుపొందిన వారికి నగదు బహుమతులతో పాటు షీల్డ్‌ను అందించారు. పట్టణంలోని శ్రీకృష్ణనగర్‌కు చెందిన గొల్ల రామకృష్ణకు చెందిన ఎద్దులు మొదటి బహుమతిని కైవసం చేసుకోవడంతో రూ.12 వేల నగదును బీజేపీ సీనియర్ నాయకుడు మేర్వరాజు అందించారు. నాల్గవ బహుమతి రాజారెడ్డికి చెందిన ఎద్దులు గెలుపొందగా రూ.5 వేల నగదును క్యామ భాస్కర్ అందజేశారు. కార్యక్రమంలో ఎర్ర సత్యనారాయణ, విజయ్ యాదవ్, శ్రీనివాస్ యాదవ్‌లు పాల్గొన్నారు.



భక్తిశ్రద్ధలతో షబే ఖదర్ వేడుకలు

స్టేషన్ మహబూబ్‌నగర్: పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా జిల్లా కేంద్రం సద్దల్‌గుండ్‌లోని అలీబా అబ్దుల్లా మసీద్‌లో శనివారం రాత్రి షబే ఖదర్ వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మౌలానా గులాం మహమ్మద్ ధార్మిక సందేశం ఇచ్చారు. రంజాన్ నెలలోనే పవిత్ర గ్రంథం ఖురాన్ అవతరించిందన్నారు. ఖురాన్‌ను నిరంతరం పఠించాలని కోరారు. రంజాన్ స్ఫూర్తితో నిరుపేదలకు సేవలు చేయాలని కోరారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ పాల్గొని రంజాన్ మాసంలో పూర్తి ఖురాన్ పఠించిన హాఫిజ్‌సాబ్‌ను ఘనంగా సన్మానించారు.

మరమ్మతు చేయండి సారూ..



ఎక్లాస్‌పురం సమీపంలో కంకరతేలిన రోడ్డు

- శిథిలమైన బీటీ రోడ్డు
- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

అయిజ: గట్టు– అయిజ మండలాల మధ్య నిర్మించిన బీటీరోడ్డు శిథిలావస్థకు చేరింది. నిత్యం వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు, నాయకులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రహదారి కంకర తేలి అడుగడుగునా గుంతలు ఏర్పడ్డాయి. ప్రమాదాల్లో కొందరు ఆస్పత్రిలో చికిత్స పొంది బతికి బట్టకట్టగా మరి కొందరు మృత్యువాత పడుతున్నట్లు ప్రజలు వాపోతున్నారు. మండల పరిధిలో వరుస ప్రమాదాలు చోటుచేసుకుంటున్నా అధికారులు రోడ్డును పునఃనిర్మించడం లేదు. కనీసం గుంతలను పూడ్చి మరమ్మతు కూడా చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కంకరవేసి వదిలేశారు..

అయిజ నుంచి గట్టుకు ఏర్పాటు చేసిన రోడ్డు అనేక చోట్ల గుంతలు పడి అస్తవ్యస్తంగా మారింది. ప్యాచ్ వర్క్ చేసేందుకు గత సంవత్సరం అధికారులు పనులు మొదలు పెట్టారు. కాంట్రాక్టర్ కంకర పరిచి వదిలేశారు. దీంతో ప్రయాణానికి ప్రతికూలంగా మారింది. అదే విధంగా అయిజ నుంచి ఉప్పలకు 20 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన బీటీ రోడ్డు బీటలు బారింది. గుంతలు పడి ఏళ్లు గడుస్తున్నా కనీసం ప్యాచ్ వర్క్ కూడా చేయడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. శిథిలమైన రోడ్లను పునః నిర్మించి, పాక్షికంగా దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేయాలని ఆయా మండలాల ప్రజలు కోరుతున్నారు.

శిథిలమై ఏళ్లు గడుస్తుంది



గట్టు– అయిజ మండలాల మధ్య అనేక గ్రామాలకు ఏర్పాటు చేసిన బీటీ రోడ్డు శిథిలమై ఏళ్లు గడుస్తుంది. నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. కాలం చెల్లకముందే వాహనాల టైర్లు అరిగిపోతున్నాయి. గ్రామాలకు ఆటోలు రావడానికి డ్రైవర్లు విముఖత వ్యక్తం చేస్తున్నారు. – దేవేంద్ర, ఎక్లాస్ పురం

అదుపుతప్పుతున్న వాహనాలు



మండలంలోని చాలా గ్రామాల్లో రోడ్లు శిథిలమయ్యాయి. గుంతలు పడడంతో వాహనాలు అదుపుతప్పి బోల్తా పడుతున్నాయి. ప్రమాదాల్లో ఇప్పటికే అనేక మంది గాయపడ్డారు. కొంత మంది మృతి చెందారు. శిథిలమైన రోడ్లకు మరమ్మతు చేపడితేనే ప్రమాదాలను నివారించవచ్చు. – దరెన్న, అయిజ

ప్రతిపాదనలు పంపించాం

శిథిలమైన రోడ్లను పునఃనిర్మించేందుకు, అవసరమైన చోట ప్యాచ్ వర్క్ చేసేందుకు ప్రతిపాదనలు పంపాం. అయిజ– గట్టు రోడ్డులో ఎక్లాస్‌పురం వద్ద ప్యాచ్‌వర్క్ పనులు చేపట్టాం. కొన్ని కారణాల వలన పనులు ఆలస్యమవుతున్నాయి. నిధులు మంజూరైన వెంటనే రోడ్లకు మరమ్మతు చేపడుతాం. – అల్తాఫ్, ఆర్అండ్‌బీ ఏఈ

ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలి

అయిజ: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపు కోసం ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని బీజేపీ జిల్లా నాయకుడు రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామచంద్రారెడ్డి మాట్లాడారు. పల్లె, పట్టణంలో పార్టీ మరింతగా బలపడేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. అనంతరం మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు గోపాలకృష్ణ, లక్ష్మణ్ గౌడ్, నరసింహ, భీమన్న, రామాంజనేయులు, మహేష్ పాల్గొన్నారు.



మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న బీజేపీ నాయకులు

ఓవైపు మలుపులు.. మరోవైపు గుంతలు



చెన్నిపాడులో ప్రమాదకరంగా ఉన్న మూలమలుపు

- ప్రమాదాలకు నిలయంగా మలుపులు
- గుంతలతో దర్శనమిస్తున్న రహదారులు

మానవపాడు: మండలంలోని గోకులపాడు గ్రామం నుంచి చంద్రశేఖర్‌నగర్‌కు వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారి నిత్యం ప్రమాదాలు సంభవిస్తున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. రాత్రి సమయాల్లో భయాందోళనలో ప్రయాణాలు సాగిస్తున్నట్లు వాపోతున్నారు. అనేకమార్లు అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాదకరంగా మలుపులు..

అదే విధంగా మండలంలోని చెన్నిపాడు, మానవపాడు, అమరవాయి, చండూరు, బోరవెల్లి తదితర గ్రామాల్లోని ప్రధాన రహదారుల్లో మూల మలుపుల వద్ద నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని వాపోతున్నారు. కనీసం సూచికలు కూడా ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాల బారిన పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేయాలని అదే విధంగా మలుపుల వద్ద సూచికలు ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



గోకులపాడు నుంచి చంద్రశేఖర్‌నగర్ వెళ్లే రోడ్డులో ఏర్పడిన గుంత

సింగంపేటలో తాగునీటి ఇబ్బందులు

అమరచింత: మండలంలోని సింగంపేటలో మూడు రోజుల నుంచి తాగునీటి ఇబ్బందులు ఏర్పడినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు పేర్కొన్నారు. మిషన్ భగీరథ ద్వారా తాగునీటిని అందించేందుకు ఏర్పాటు చేసిన రెండు ఓవర్ హెడ్ ట్యాంకులు నీరులేక దిష్టి బొమ్మలుగా దర్శన మిస్తున్నాయని తెలిపారు. మిషన్ భగీరథ ద్వారా నిత్యం కుళాయిల ద్వారా ఇంటింటికి తాగునీరు అందించే వారని ప్రస్తుతం కుళాయిలకు నీటి సరఫరా నిలిచిందని పేర్కొన్నారు. ఎర్రగట్టు వద్ద పైప్‌లైన్ లీకేజీ వల్ల తాగునీరు రావడం లేదని మిషన్ భగీరథ సిబ్బంది పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



సింగంపేటలోని ఓవర్ హెడ్‌ట్యాంక్

ముగిసిన క్రీడా పోటీలు



ఆరేపల్లిలో క్రికెట్ విజేతలకు బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు

ఆత్మకూర్: మక్తల్ ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి ఆధ్వర్యంలో అల్లీపూర్ ఇండోర్ స్టేడియంలో మూడురోజులుగా నిర్వహిస్తున్న షటిల్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా మొదటి బహుమతి సాధించిన విజేతలు క్యాంపు నరేందర్‌గౌడ్, రాజు, రెండో బహుమతి సాధించిన గట్టన్న, శివలకు నగదుతో పాటు షీల్డులను నిర్వహకులు రహ్మతుల్లా, పరమేష్, తులసీరాజ్, శ్రీను బహూకరించారు. కార్యక్రమంలో క్రీడాకారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఆరేపల్లిలో క్రికెట్ పోటీలు

ఆత్మకూర్ మండలంలోని ఆరేపల్లిలో మండల స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజేతలకు రూ.50 వేలు నగదుతో పాటు షీల్డులు బహూకరించారు. కార్యక్రమంలో ఎస్ఐ నరేందర్, పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మీకాంత్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ కోటేష్, మాజీ సర్పంచ్ అనసూయ, ప్రభాకర్‌రెడ్డి, రాంచంద్రయ్య, రాజేందర్‌గౌడ్, నాగన్న, ఆంజనేయులు, తిరుపతన్న, రాములు, దేవేంద్రం, వెంకటన్న, ఆనంద్, క్రీడాకారులు ఉన్నారు.



షటిల్ పోటీల విజేతలకు బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు

కొత్తపేటకు బస్సు సౌకర్యం కల్పించండి



కొత్తపేట గ్రామ బీటీ రోడ్డు

పాన్‌గల్: బీటీ రోడ్డు ఉన్న ప్రతి గ్రామానికి ఆ ర్టీసీ బస్సును నడిపిస్తామని ఒక పక్క పాల కులు, మరో పక్క అధికారులు చెబుతున్నా క్షేత్ర స్థాయిలో ఇచ్చిన హామీలు అమలు కాక గ్రామీ ణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా రు. మండలంలోని కొత్తపేట గ్రామానికి బీటీ రోడ్డు సౌకర్యం ఉన్న ఆర్టీసీ బస్సులు నడవకపోవడంతో గ్రామస్తులు, వి ద్యార్థులు మూడు కిలోమీటర్లు నడుచుకుంటూ వెళ్లాల్సి వస్తోంది. మాందాపూర్ గ్రామం వర కు నడిచి వెళ్లి బస్సు ఎక్కాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ విషయాన్ని మంత్రి జూపల్లి దృష్టికి, ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పాల కులు స్పందించి తమ గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించి ఇబ్బందులు తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

తిరుమలనాథస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

కోయిల్‌కొండ: మండలంలోని చన్మన్‌పల్లి గ్రామంలోని తిరుమలనాథ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయంలో నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూడు రోజులు వైభవంగా ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఎస్‌డీఎఫ్ నిధుల ద్వారా ఏర్పాటుచేసిన మంచినీటి సౌకర్యంపై ఎమ్మెల్యే ఆరాతీశారు. ఆలయాభివృద్ధికి కావాల్సిన నిధులు కేటాయించేందుకు కృషి చేస్తానని ఆమె హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండ ల అధ్యక్షుడు జి.రవీందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వై.విద్యాసాగర్‌గౌడ్, నాయకులు రవినాయక్, సత్యపాల్‌రెడ్డి, వెంకట్రాములు, థావుర్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.